# సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం



దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

- దరఖాస్తు చేసుకుంటే ప్రోత్సహిస్తాం
- జిల్లాలో ప్రతినెలా రూ. 6 కోట్లకు పైచిలుకు పింఛన్లు అందిస్తున్నాం
- కలెక్టర్ పీ ప్రావీణ్య

ఖిలావరంగల్, డిసెంబర్ 15: సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ సెల్‌తోపాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంజీఎం దవాఖానలో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఓపీని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం వివిధ రకాల ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తున్నా అవగాహన లేకపోవడం వల్ల దివ్యాంగులకు చేరలేకపోతున్నాయని తెలిపారు. ఈ విషయమై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, అసోసియేషన్ సభ్యులు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వ పరంగా వివిధ పథకాలు, ఎకనామికల్ సపోర్ట్ స్కీమ్‌లు ఉన్నాయన్నారు. వ్యాపార పరంగా అవగాహన కలిగిన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లాలో ప్రతి నెల రూ. 6 కోట్లకు పైచిలుకు దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. ఎంజీఎం దవాఖానలో సదరం సర్టిఫికెట్ల మంజూరులో జరిగిన అవతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో ఉద్యోగులుగా ఉన్న దివ్యాంగుల ఆత్మాభిమానం దెబ్బతినకుండా చూసుకోవాల్సిన బాధ్యత జిల్లా అధికారులతోపాటు తోటి ఉద్యోగులపై ఉందన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసి, వారితోనే విధులు నిర్వర్తింపజేసినట్లు గుర్తుచేశారు. ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించారని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అభినందించారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడల్లో గెలుపొందిన 77 మందికి సర్టిఫికెట్లు, షీల్డులు ప్రదానం చేశారు. డీబ్ల్యూవో శారద, డీఆర్డీవో సంపత్‌రావు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీపీ రవీందర్, కమిటీ మెంబర్ చక్రపాణి, నర్సక్క పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ అధికారి నరహరి

## విద్యతోనే ముందడుగు సాధ్యం

నయీంనగర్, డిసెంబర్ 15: విద్యతోనే ముందడుగు సాధ్యమని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ(ఐఏఎస్ అధికారి) పరికిపండ్ల నరహరి అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని ఆదర్శకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రేరణ సదస్సులు ఎంతో అవసరమన్నారు. అనంతరం పరికిపండ్ల వేణు మాట్లాడుతూ వివరాలకు 998931014లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మేనేజర్ సూర్యకిరణ్, రాజయ్య, రామకృష్ణ, రాజేంద్రప్రసాద్, సుధాకర్, రామ్‌లక్ష్మణ్, యుగేంధర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

గిర్మాజీపేట, డిసెంబర్ 15: జిల్లాలో వచ్చే ఫిబ్రవరిలో నిర్వహించనున్న డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ అండ్ హయ్యర్ గ్రేడ్‌ల్లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్ష రాయనున్న అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. WWW.BSE.TELANGANA.GOV.IN వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తి చేసిన ఫారాలను తన కార్యాలయంలో అందజేయాలని డీఈవో కోరారు.

## రేపు సీకేఎం మైదానంలో వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 15: హనుమకొండలోని అరవింద సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కాలేజీ గ్రౌండ్‌లో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఆర్‌బీఎస్, హెచ్‌బీఏఐసీ, టీఎస్‌హెచ్, సీబీపీ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ దీపికా తైదల తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులతో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

## ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్‌గా నిఖిల్



వరంగల్, డిసెంబర్ 15: ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్‌గా అయిత నిఖిల్ నియామకమయ్యారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన సంఘం జాతీయ మహాసభలో నిఖిల్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగించాలి

హనుమకొండచౌరస్తా, డిసెంబర్ 15: భారతరత్న అవార్డు గ్రహీత, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను కొనసాగించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్-1 కాలనీలో శుక్రవారం పటేల్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, శ్రీనివాస్, అనిశెట్టి వీరాస్వామి, కుమార్‌రెడ్డి, సిరిమల్లె రాజయ్య, ప్రవీణ్, చిర్ర శ్రవణ్, రాజ్‌కుమార్, వెంకటేశ్, చందర్, అరుణ్, చిరంజీవి పాల్గొన్నారు.

## మానవ హక్కులపై అవగాహన సదస్సు

హసన్‌పర్తి, డిసెంబర్ 15: అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని బైరాన్‌పల్లి రెడ్డి కమ్యూనిటీ హాల్‌లో ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సమితి మండల కోఆర్డినేటర్ ఈసంపెల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో మానవ హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

## గ్రామీణ తపాలా ఉద్యోగుల వంటావార్పు

చెన్నారావుపేట/రాయపర్తి, డిసెంబర్ 15: గ్రామీణ తపాలా ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చింత సదానందం డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం వరంగల్ డివిజన్ ప్రాంతీయ సహాయ కార్యదర్శి పిలుపు మేరకు మండలకేంద్రంలో శుక్రవారం పోస్టాఫీస్ వద్ద వంటావార్పు నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, శ్రీకాంత్, శోభారాణి, శివకుమార్, రంజిత్‌కుమార్, సునీల్‌కుమార్, సుమన్‌నాయక్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు. అలాగే, రాయపర్తిలోని పోస్టాఫీస్ ఆవరణలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె దీక్షా శిబిరంలో పోస్టల్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబిద్‌పాషా, చందర్, చారి, యాకయ్య, రాజు, శేషమ్మ, సంధ్య పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖను కలిసిన నాయకులు



సురేఖను శాలువాతో సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల/కాశీబుగ్గ, డిసెంబర్ 15: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను పరకాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్‌రెడ్డి, డీసీసీ చేనేత సెల్ జిల్లా చైర్మన్ దాసరి భిక్షపతి, రాయపర్తి ఎంపీటీసీ పర్నెం మల్లారెడ్డి, చర్లపల్లి సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి, నాయకులు అల్లం రఘునారాయణ, మంద నాగరాజు, గూడెల్లి సదన్‌కుమార్, మాచబోయిన అజయ్ పాల్గొన్నారు. అలాగే, సురేఖను హైదరాబాద్‌లో లక్ష్మీపురం పండ్ల వర్తక సంఘం వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెల్ది సాంబయ్య, దొంగల చెన్నమల్లుయాదవ్, ఉపాధ్యక్షుడు ఆకుల నందప్రియ, సహాయ కార్యదర్శి పోలు అమర్‌చంద్, కార్యవర్గ సభ్యులు గోరంటల సమ్మయ్య, వి.తులసీకృష్ణ, వి.రాజేశ్, గుండా నాగరాజు, బొల్లం రోషన్ పాల్గొన్నారు.

# 19న జడ్పీస్థాయి సంఘం సమావేశాలు

వరంగల్, డిసెంబర్ 15(నమస్తేతెలంగాణ): ఈ నెల 19న జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్యకార్యనిర్వహణాధికారి రాంరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయి సంఘం సమావేశాలు జరిపేందుకు నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. 10.30 నుంచి 11.30 గంటల వరకు 2, 6, 5, 3వ, 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 4వ, 12.30 నుంచి 2.30 గంటల వరకు 7, 1వ స్థాయి సంఘం సమావేశాలు జరుగనున్నట్లు జడ్పీ సీఈవో వెల్లడించారు. వేర్వేరుగా జరిగే ఈ సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి, సహకారం, వ్యవసాయం, పశుసంవర్ధక, మార్కెటింగ్, మహిళా సంక్షేమం, సాంఘిక విద్య, వైద్య సేవలు, ప్రజారోగ్యం, నీటి పారుదల, పారిశుధ్యం, క్రీడలు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, జాతీయ రహదారులు, మౌలిక వసతులు, జిల్లా ప్రణాళిక, బడ్జెట్ పన్ను విధింపు, గనులు, పౌరసరఫరాపై చర్చ ఉంటుందని, వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని జడ్పీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

# ఐఎంఏ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ కాళీప్రసాద్

వరంగల్ చౌరస్తా, డిసెంబర్15: ఐఎంఏ వరంగల్ విభాగం నూతన కార్యవర్గం శుక్రవారం ఐఎంఏ హాల్‌లో ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా డాక్టర్ మహ్మద్ అన్వర్‌మియా, ఉపాధ్యక్షులుగా డాక్టర్ అజిత్ మహ్మద్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, డాక్టర్ బుర్రి సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బింగి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా డాక్టర్ వి.నరేశ్‌కుమార్, డాక్టర్ టి.రామకృష్ణ, డాక్టర్ అనిత, కోశాధికారిగా డాక్టర్ శ్రవణ్‌కుమార్ ప్రమాణం చేశారు. ముఖ్య అతిథిగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాద్ హాజరై వైద్యులు సమాజంపై బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. గౌరవ అతిథులుగా జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవీందర్‌రెడ్డి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఎథికల్ కమిటీ చైర్మన్ డాక్టర్ శేషుమాధవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ అశోక్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సంధ్యారాణి, తెలంగాణ ఐఎంఏ హెల్త్ స్కీం చైర్మన్ డాక్టర్ మోహన్‌రావు, ప్రత్యేక అతిథులుగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సాంబశివరావు, వెంకటరమణ పాల్గొన్నారు.




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ మహేందర్

## రైతులు అధిక దిగుబడి సాధించాలి

కరీమాబాద్, డిసెంబర్ 15: పత్తి సాగులో రైతులు అధిక సాంద్రత పద్ధతిని అవలంబించి అధిక దిగుబడి సాధించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి డాక్టర్ మహేందర్ సూచించారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న ఆధ్వర్యంలో అధిక సాంద్రత గల పత్తిపై శుక్రవారం కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేందర్ మాట్లాడుతూ రైతులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ, ఏవో డాక్టర్ రవీందర్, ఉద్యాన శాఖ అధికారి శ్రీనివాస్, ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ సారంగపాణి, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

## 'విద్యా ప్రగతిని యాప్‌లో నమోదు చేయాలి'

ఐనవోలు, డిసెంబర్ 15: విద్యార్థుల ప్రగతిని ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని ఐనవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని ఉడుతగూడెం, గర్మిళ్లపల్లి పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, తొలిమెట్టు రికార్డులను పరిశీలించారు. ఎఫ్‌ఎల్‌ఎస్ సంబంధించిన బేస్‌లైన్ టెస్ట్, మాస పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రతి నెల 27, 28వ తేదీల్లో మండలస్థాయిలో జరిగే రివ్యూ మీటింగ్ వివరాలను కూడా యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. ఆయన వెంట రిసోర్స్‌పర్సన్ చుంచుకాల లింగారావు, సీఆర్పీ రేవతి ఉన్నారు.

## 'పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిది'

గిర్మాజీపేట, డిసెంబర్ 15: తెలుగు వారికి స్వరాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు మహనీయుడని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. శుక్రవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్‌ఎన్‌టీ రోడ్‌లోని పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, కార్యాలయ కార్యదర్శి మల్యాల వీరమల్లయ్య, కొండూరు శివప్రసాద్, గుండా మల్లికార్జున్, బోనగిరి రాజన్న, అయిత ప్రసాద్, ఎలిశాల ఆనంద్‌కుమార్, కార్యాలయ సిబ్బంది అజయ్‌కుమార్, శ్రీలతాదేవి, మంజుల, ప్రవీణ, లావణ్య, రమాదేవి, పూజ, ప్రియాంక, రమ, సారంగపాణి పాల్గొన్నారు.

## శివానందమూర్తి జ్ఞాపకార్థం ఇంటి నిర్మాణం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 15: సద్గురు శివానందమూర్తి జ్ఞాపకార్థం ములుగు రోడ్డులోని సప్తధామం ఆధ్వర్యంలో ఓ నిరుపేద కుటుంబానికి గూడు కట్టించారు. పైడిపల్లిలోని ఓ వృద్ధ దంపతులకు ఇల్లు నిర్మించి ఇచ్చామని శివానందమూర్తి కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. సప్తధామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పైడిపల్లిలోని ముంజ రామస్వామి దంపతుల ఇల్లు కూలిపోతే ట్రస్టు తరఫున రూ. 1.50 లక్షల వ్యయంతో కొత్త ఇంటి నిర్మాణం చేసి ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మదారపు సదాశివుడు, గందె ఉమాశంకర్, కొడిమెళ్ల విజయ్‌కుమార్, గొస్కుల సుదర్శన్, జన్ను రంజిత్, ఎం.మునీర్ పాల్గొన్నారు.